వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో సీతారాముల కల్యాణోత్సవంలో పుస్తెలతాడు చూపిస్తున్న అర్చకుడు

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఏటా వసంత రుతువులో చైత్ర శుద్ధ నవమి నాడు ఈ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇదే రోజున శ్రీరాముని జననం, పట్టాభిషేకం, సీతారాముల కల్యాణం జరిగిందని ప్రతీతి. ఈ నేపథ్యంలో ఆలయాల వద్ద పండగ వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచే మందిరాలకు చేరుకున్న భక్తులు శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేసి, సీతారాముల కల్యాణోత్సవం, పట్టాభిషేకం తిలకించి, మంత్రముగ్ధులయ్యారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్‌



సంతకవిటి: మాంగల్యధారణ..



సంతకవిటి: సీతారాముల కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు



వంగర: కొనంగిపాడులో జరిగిన రాములోరి కల్యాణానికి హాజరైన భక్తులు



వంగర: కొప్పరవలసలో శ్రీరామనవమి వేడుకల దృశ్యం



తెర్లాం: కూనాయవలసలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే బేబీనాయన



రామభద్రపురంలోని వసంతుల వీధి రామమందిరంలో సీతారాముల కల్యాణ వేడుక దృశ్యం



బాడంగి: చినభీమవరంలో సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు రామశాస్త్రి



రేగిడి: జోడుబందలలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



బొబ్బిలి: బొబ్బిలిలోని దావాల వీధిలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



రాజాం: పెనుబాకలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు



తెర్లాం: నందబలగలో సీతారాముల కల్యాణం చేస్తున్న వేదపండితులు



రాజాం: బుచ్చింపేటలో శ్రీరాముడికి భక్తుల పూజలు



సంతకవిటి: ఆకట్టుకున్న చిన్నారుల గీతాలాపన



సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో సీతారాముల దర్శనానికి పోటెత్తిన భక్తులు



బొబ్బిలిరూరల్: పిరిడిలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



రాజాం సిటీ: ఆదర్శనగర్ రామమందిరంలో శ్రీరామనవమి వేడుకలు

క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన యువకులు.. విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని, ఈ పోటీలు పెట్టామని యువకుడు రెయ్యి రామకృష్ణ తెలిపారు. విజేతలకు అదేరోజు బహుమతులు అందిస్తామన్నారు.

సిరిమాను చెట్టు తరలింపు



సిరిమాను చెట్టు తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లిలో దాడితల్లి సిరిమానోత్సవానికి సంబంధించి, సిరిమాను తయారీకి కృష్ణాపురంలో గుర్తించిన సిరిమాను చెట్టును గ్రామానికి ఆదివారం తరలించారు. మే 4, 5, 6వ తేదీల్లో దాడితల్లి అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మే 5వ తేదీన జరిగే సిరిమానోత్సవానికి సిరిమాను తయారు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మండల జనార్దనరావు, వి.రవికుమార్, సాయి హేమంత్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర సంక్షేమ శాఖల కళాశాలలతో పాటు హైస్కూల్ ప్లస్ కళాశాలలన్నీ కలిపి మొత్తం 203 కళాశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారంతా తమకు నచ్చిన కళాశాలకు వెళ్లి, నేరుగా దరఖాస్తు చేసుకుని కోర్సులో చేరవచ్చు. ఈ కొత్త విద్యా సంవత్సరం నుంచే నూతన విద్యా విధానం అమలు చేసి, ఇంటర్మీడియట్‌లో కొత్తగా ఎంబైపీసీ(మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ)ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

భక్తుల సేవలో..



భక్తులకు బెల్లం పానకం పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ దామోదరరావు

చీపురుపల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా ఆటో స్టాండ్‌లో శ్రీనివాసా గోవిందా ఆటోసేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం బెల్లం పానకం, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఐ ఎల్.దామోదరరావు ప్రారంభించారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వండూరి తాతాజీ, సంఘ సభ్యులు సూర్యనారాయణ, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడపేటలో నేత్ర వైద్యశిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: కొవ్వాడపేటలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల వద్ద విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన 50 మందికి ఆప్తాలమిక్ సురేష్ నేత్రపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీ వరిసాగు



కోతదశకు చేరుకున్న వరి పంట

లక్కవరపుకోట: మండలంలో రబీ వరిపంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది రబీసీజన్‌లో సుమారు 60 ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. లచ్చింపేట, లక్కవరపుకోట, గొల్జాం, సీతారాంపురం గ్రామాల్లో పంట కోత దశకు చేరుకుంది. గత ప్రభుత్వంలో రైతులకు రైతుభరోసా పథకం పేరిట పెట్టుబడి సాయం అందేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా పథకానికి అన్నదా త సుఖీభవగా ప్రభుత్వం పేరు మార్చింది కానీ గత ఖరీఫ్‌లోనూ రూపాయి పెట్టుబడి సాయం ఇవ్వలేదు. రబీలో కూడా ఇవ్వలేదు. రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది.

సంక్షేమ పథకాలు.. ఇక అందని ద్రాక్షే..

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఇక అందని ద్రాక్షేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ బూటకపు హామీలేనన్నారు. తల్లికి వందనం ఇవ్వలేదు గానీ తండ్రికి ఇంధనం(మద్యం) మాత్రం ఇచ్చారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ మద్యం ఏరులై పారుతోందని, తాగుడుతో చాలామంది జీవితాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఆయన ఆడపిల్లలకు ప్రతినెలా ఇస్తానన్న రూ.1500 హామీ అడ్రస్ లేకుండా పోయిందన్నారు. అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు ఇస్తానన్న రూ.20 వేల సాగు సాయం హామీ గాల్లో కలిసిపోయిందన్నారు. నిరుద్యోగ భృతి జాడే లేదన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి, ప్రజలను నిలువునా ముంచేశారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, ఇచ్చిన హామీలు అమలుచేయకుంటే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



రేగిడి మండలం, తాటిపాడు గ్రామంలో రాజాం జీఎంఆర్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్(జాతీయ సేవా పథకం) కార్యకర్తలు(విద్యార్థులు) ఆదివారం స్వచ్ఛభారత్ చేపట్టారు. అందరూ పలుగు, పార చేతబట్టి కాలువల్లోని పూడికలు తీశారు. రోడ్లపై ఉన్న చెత్తాచెదారం, కలుపు మొక్కలు తీసేసి ఆరుబయట దూరంగా పారబోశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని వారు గ్రామస్తులను చైతన్యం చేశారు.

–రేగిడి

సబ్సిడీపై పంపిణీకి విత్తనాలు సిద్ధం

వంగర: రైతులకు సబ్సిడీ(రాయితీ)పై పంపిణీ చేసేందుకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో తట్టికోట కన్నబాబు ఆదివారం తెలిపారు. పెసర, మినుము, నువ్వు, రాగి తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టాస్ వేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలోని డీఎఫ్‌ఎస్ ప్రాంతానికి చెందిన యువకులు చంటి,కరుణ, పైడిరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారి స్మారకార్థం డీఎఫ్‌ఎస్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రాధిక మెటల్స్ అండ్ మినరల్స్ సంస్థ సౌజన్యంతో నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్‌ను రాధిక మెటల్స్ అండ్ మినరల్స్ సంస్థ ప్రతినిధి సత్యనారాయణ,స్థానిక ప్రజాప్రతినిధులు నేతేటి కృష్ణవేణి, తోట రవి, వాల్లె చిట్టియ్య, జోగినాయుడు ఆదివారం ప్రారంభించారు. చీపురుపల్లి,గరివిడి,గుర్ల మండలాల నుంచి 50 జట్లు పాల్గొంటున్నాయని, మూడు వారాల పాటు టోర్నమెంట్ జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

ఇష్టారాజ్యంగా రోడ్లపై పార్కింగ్



రామభద్రపురం రోడ్లపై వాహనదారులు తమ ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేసేస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉండే పార్కింగ్ కారణంగా తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిసార్లు రహదారులా.. పార్కింగ్ స్థలాలా అనేలా కనిపిస్తున్నాయి. రోడ్లు ఆక్రమణకు గురికావడంతోనే ఇటువంటి పరిస్థితులు చోటుచేసుకుంటుండగా ఇటీవల ఆక్రమణలు తొలగించాలని వ్యాపారులను అధికారులు హెచ్చరించారు. అయినా ఆక్రమణలు తొలగించకపోవడంతో రోడ్ల మీదే వాహనాలు నిలిపివేస్తున్నారు.

–రామభద్రపురం

అధ్వానంగా ఖండ్యాం-గుళ్లసీతారాంపురం రోడ్డు



రేగిడి మండలంలోని ఖండ్యాం-గుళ్లసీతారాంపురం బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. దారి పొడవునా గోతులు ఉండడంతో పాటు రోడ్డు మొత్తం ధ్వంసం కావడంతో రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులకు రూ.4 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని కూటమి నాయకులు ఓ వైపు చెబుతుంటే.. మరోవైపు రోడ్లు ఇలా ఉండడాన్ని ప్రజలంతా విమర్శిస్తున్నారు. మాటలేనా.. చేసేదేమైనా ఉందా అని ప్రశ్నిస్తున్నారు. కొత్త రోడ్లు వేయకపోయినా కనీసం పాడైన రోడ్లనైనా బాగు చేయండి అని కోరుతున్నారు.

–రేగిడి

బంగారువలస-విశాఖ బస్సు పునరుద్ధరించాలి

వంగర: బంగారువలస-విశాఖపట్నం బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇదివరకు ఉన్న ఈ బస్సును గత కొన్ని నెలల క్రితం నిలిపివేశారు. అప్పటి నుంచి సొంత పనుల నిమిత్తం విశాఖపట్నానికి వెళ్లాలనుకునే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు ఫస్ట్ బస్సు, రాత్రి 10 గంటలకు నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం ఉండేది. ఆర్టీసీ అధికారులు స్పందించి, ఆయా వేళల్లో బస్సు సర్వీసులు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్యసిబ్బందికి సేవారత్న పురస్కారాలు

కొత్తవలస: విజయవాడకు చెందిన మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ సంస్థ, గ్లోబల్ ఫౌండేషన్ వారు మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రి నాయుడు,హెల్త్ అసిస్టెంట్ సత్యారావుకు సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడలోని అలంకార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారి, హెల్త్ అసిస్టెంట్‌ను నిర్వాహకులు సత్కరించి, అవార్డులు అందజేశారు. వైద్యాధికారి సింహాద్రి నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించడం, కోవిడ్ సమయంలో కరోనా నిర్ధారణ పరీక్షలు చేయడం, కోవిడ్ వ్యాక్సినేషన్, డెంగ్యూ, మలేరియా,టీబీ,లెప్రసీ వ్యాధులపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించినందుకు ఈ అవార్డులు అందజేశారని తెలిపారు. అవార్డు గ్రహీతలకు ఆస్పత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముగిసిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు



ఆలయ ప్రతిష్ఠోత్సవాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: భూపాల రాజపురంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేదపండితులు రేజేటి రామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సీతారామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సీతారాములను మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పల నాయుడు దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్ నేరేడుబిల్లి గురునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షల విరాళం

రామాలయానికి వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ రూ.3 లక్షలు విరాళం అందజేశారు. నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.